సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 21 । డిసెంబర్ । 2024



ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. IIలో



నదులకు వరద తాకిడి

అల్పపీడన ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తాచేరు, శారదానది, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి.



శ్రీవారికి వారాంతపు పూజలు

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రానున్న వారంలో తేలిక పాటి వర్షాలు

- చింతపల్లి ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి: జిల్లాలో రాను న్న వారం రోజుల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు వారం రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 20.3 నుంచి 22.4 డిగ్రీల సెంటీగ్రేడ్, కనిష్ట ఉష్ణోగ్రతలు 15.0 నుంచి 17.3 డిగ్రీల సెంటీ గ్రేడ్ మధ్య ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం వేళలో 92 నుంచి 97 డిగ్రీలు, మధ్యాహ్నం వేళలో 65 నుంచి 88 డిగ్రీలు ఉండే అవకాశం ఉందన్నారు. గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆయన వెల్లడించారు. గిరిజన రైతాంగం వరి కోతలను వాతావరణం మెరుగుపడే వరకు వాయిదా వేసుకోవాలని ఏడీఆర్ సూచించారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్

అనంతగిరి (అరకులోయ టౌన్): ఈనెల 21వ తేదీ శనివారం డిప్యూటీ సీఎం కె. పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ అమిత్ బర్దర్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పినకోట పంచాయతీ బల్లగరువులో సభా వేదిక, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు బల్లగరువు చేరుకుని గిరిజనులతో సమావేశమవుతారు. అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని అధికారవర్గాలు తెలిపాయి.

27న ఇంటర్న్‌షిప్ ప్రవేశాలు

- చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి



చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 27న ఇంటర్న్‌షిప్ ప్రవేశాలను కల్పిస్తున్నట్లు కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయబారతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఆరు నెలలపాటు శిక్షణకు పంపిస్తామన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు సిటీ ఇండస్ట్రీస్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగదీష్‌బాబు, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బందవీధి

- రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి బందవీధి గ్రామానికి రెండురోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొందని గ్రామస్తుడు కిల్లో సన్యాసిరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా తమ గ్రామానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈవిషయాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ రహిత రక్షిత అడవులే లక్ష్యం



పెదార్యూరులో ప్లాస్టిక్ వ్యర్థాలు నింపిన బ్యాగ్‌లతో అటవీశాఖ అధికారులు

కూనవరం: ప్లాస్టిక్ రహిత రక్షిత అడవులే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ తెలిపారు. మండల పరిధిలోని పెదార్యూరు, రేపాక, బందారుగూడెం గ్రామాల వెంబడి రక్షిత అడవుల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. సబ్‌డివిజనల్ ఆఫీసర్ కేవీఎస్ రాఘవరావు ఆధ్వర్యంలో 150 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించామన్నారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు అనిల్ కుమార్, సాయి వెంకటరమణ, శంకర్‌రెడ్డి, విజయలక్ష్మి, ఎఫ్‌బీవో జంపన్నరాజు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. నాడు–నేడు పథకంలో పాఠశాల రూపురేఖలను మార్చేశారు. అక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉన్న మైదాన ప్రాంతాల విద్యార్థులతో గిరిజన విద్యార్థులు పోటీపడేలా సంస్కరణలు చేపట్టారు. ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. ఉత్తమ ప్రమాణాలతో విద్యను అందించడంతో సివిల్స్‌లో సైతం సత్తాచాటారు. గతేడాది గిరిజన విద్యార్థుల మధ్య తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అండగా తానున్నానని భరోసా నింపారు. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో పేద విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి.



గత ఏడాది డిసెంబర్ 21న చింతపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఎనలేని సంస్కరణలు..
ప్రగతి పరుగులు
జగనన్న పాలనలో పేదల చదువులకు అధిక ప్రాధాన్యం



సాక్షి,పాడేరు: స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఎందరో పాలించారు. గిరిజన ప్రాంతాల్లో విద్యపై పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేశారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సంస్కరణలు చేపట్టారు.

గిరిజన విద్యకు ఊపిరి

గిరిజన ప్రాంతంలో విద్యకు జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోశారు. అప్పటి నుంచి గిరిజన విద్యార్థుల దశ తిరిగింది. కూలిపోయే స్థితిలో ఉండే పాఠశాల భవనాలను నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మొదటి విడతలో 579 పాఠశాలలు, రెండవ విడతలో 947 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించారు.

- డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి 2022 నుంచి 8వతరగతి విద్యార్థులకు అవసరమైన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. 2022–23 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 13,848మందికి ట్యాబ్‌లు అందజేశారు. 2023– 24కు గాను సీఎం హోదాలో జగనన్న స్వయంగా చింతపల్లి వేదికగా 8వతరగతి విద్యార్థులకు 14,141 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గతేడాది డిసెంబర్ 21న అదే చింతపల్లిలో గిరిజన విద్యార్థుల సమక్షంలో పుట్టినరోజు జరుపుకుని తాను గిరిజన పక్షపాతి అని మరోసారి చాటి చెప్పారు.



దుంబ్రిగుడ కేజీబీవీలో ట్యాబ్‌లను వినియోగిస్తున్న టెన్త్ విద్యార్థినులు



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చెందిన కూనవరం కేజీబీవీ పాఠశాల



గిరిజన విద్యార్థులతో కలిసి చింతపల్లిలో పుట్టిన రోజు వేడుకను జరుపుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- మొదటి విడతలో నాడు–నేడు పథకంలో 581 పాఠశాలల అభివృద్ధికి రూ.16,527.07లక్షలు, రెండో విడతలో 967 పాఠశాలల అభివృద్ధికి రూ.21,814.35లక్షల కేటాయించారు.
- జిల్లాలో 1,01,170 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.151కోట్ల 75లక్షల 50వేల చొప్పున ఏటా జమ చేశారు.
- జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,62,123 మంది విద్యార్థులకు ఏటా క్రమం తప్పకుండా జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.
- టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 750 మంది విద్యార్థులకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో జగనన్న అణిముత్యాలు పథకంలో ఘనంగా సత్కరించారు. రూ.19.84లక్షల మేర నగదు పోత్సాహకాలను అందజేశారు.
- జిల్లాలో మొదటి విడతలో 13,848 మంది 8వతరగతి విద్యార్థులు, వారికి బోధించే 1159 మంది ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు.
- పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ బ్లాక్ బోర్డుల స్థానంలో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. 154 పాఠశాలల్లో ఐపీఎఫ్‌లు, మరో 724 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటుచేశారు.
- ప్రతి ఏటా 13,578 మంది విద్యార్థులకు రూ.17.91 కోట్ల విద్యా దీవెన, 7,550 మంది విద్యార్థులకు రూ.7.25 కోట్ల వసతి దీవెన పథకంలో జమచేశారు.

ట్యాబ్‌లతో ఎంతో మేలు



8వతరగతిలో ట్యాబ్ ఇచ్చారు. ప్రస్తుతం టెన్త్ చదువుతున్నా. ఇంగ్లీషులో చదువులకు ట్యాబ్‌లు ఎంతో మేలు చేస్తున్నాయి. ట్యాబ్‌ల ద్వారానే ఉపాధ్యాయులు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ ఏడాది టెన్త్‌లో అధిక మార్కులు సాధించే లక్ష్యంతో చదువుతున్నా. ట్యాబ్‌లు పంపిణీ చేసిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం

– పాంగి ఉమాదేవి, కేజీబీవీ విద్యార్థిని, దుంబ్రిగుడ

విద్య, వసతి దీవెనల ఊసేదీ?



మా కుమార్తె చదువుకు జగనన్న ప్రభుత్వంలో విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా నగదు ప్రోత్సాహకం అందేవి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కూటమి ప్రభుత్వం మాత్రం విద్యా, వసతి దీవెన పథకాల ఊసెత్తకపోవడం అన్యాయం. తమ కుమార్తె చదువుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. జగనన్నను ఎన్నటికీ మరువలేం.

– కిల్లో మాధవరావు, విద్యార్థిని తండ్రి పోతంగి, దుంబ్రిగుడ మండలం

అమ్మ ఒడితో ఆర్థిక భరోసా



అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా ఆర్థిక భరోసా ఉండేది. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయతో తమ పిల్లల చదువులకు అమ్మ ఒడి సాయం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అమ్మ ఒడి సాయం నిలిపివేయడం అన్యాయం. ఎందరు పిల్లలు ఉన్నా ఒకొక్కరికి రూ.15వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఆ ఊసెత్తడం లేదు.

– ముత్యాల లక్ష్మి, విద్యార్థి తల్లి, కూనవరం

నాడు-నేడుతో బడులు అద్భుతం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకంలో పాఠశాలలను అద్భుతంగా అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో పిల్లలకు రక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు తదితర అన్నిరకాల మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. మా కుమార్తె చదువుతున్న గంగవరం ఎంపీపీ పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు.

– వరదా వీరాస్వామి, విద్యార్థిని తండ్రి దొరగంగవరం, గంగవరం మండలం

పాఠశాలల్లో కార్పొరేట్ సౌకర్యాలు



నాడు–నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తల్లిదండ్రులతో పాటు విద్యార్థులంతా రుణపడి ఉంటారు. కూనవరం కేజీబీవీతో పాటు అనేక ప్రభుత్వ పాఠశాలలు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేందుకు వీలుగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేశారు.

– కారం రాజమ్మ, విద్యార్థి తల్లి, కూనవరం

సమస్యల పరిష్కారంపై దృష్టి

కలెక్టర్ దినేష్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: గిరిజనుల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జేసీ అభిషేక్ గౌడ, పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌తో కలిసి మీకోసం పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు.

సభ్యత్వాల పెంపునకు చర్యలు

రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల పెంపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. లైఫ్ టైమ్ సభ్యత్వానికి రూ.1160 చెల్లించాలన్నారు. విరాళాలు ఇచ్చేవారు ముందుకు రావాలని కోరారు. మండలానికి 100 మంది చొప్పున 2025 జనవరి నెలాఖరుకు వెయ్యిమంది చేరేలా లక్ష్యం పెట్టుకోవాలని ఆదేశించారు. మూడు నెలలకోసారి సొసైటీ సమావేశం ఏర్పాటుచేయాలని, అన్నిశాఖల అధికారులు ప్రత్యేక చొరవతీసుకుని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 11 అర్జీలు

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ రజని, జిల్లా వ్యవసాయాధికారి నందు, హౌసింగ్ డీఎం బాబు, ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి, సివిల్ సప్లయ్ సరఫరా జిల్లా అధికారి గణేష్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

రాజ్‌మా రైతుల్లో ఆందోళన



పాడేరులో బోసిపోయిన వారపు సంత

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మన్యంలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వేకువజామునుంచి సాయంత్రం వరకు పాడేరు పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తూనే ఉండటంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడుకుంటున్నారు. రాజ్‌మా దిగుబడి దశలో ఉన్నందున ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. పాడేరు, అరకులో వారపు సంతలు బోసిపోయాయి.

జిల్లాలో 117.4 ఎంఎం వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 117.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనంతగిరిలో 55.2, అరకులోయలో 14.8, పాడేరులో 10.8, జి.మాడుగులలో 8.6, డుంబ్రిగుడలో 7.4, హుకుంపేటలో 5.8, ముంచంగిపుట్టులో 3.2, చింతూరులో 2.8, గూడెంకొత్తవీధిలో 2.6, చింతపల్లిలో 2, కూనవరంలో 1.4, అడ్డతీగలలో 1, పెదబయలులో 0.6, వై.రామవరంలో 0.6, గంగవరం 0.4 ఎంఎం వర్షపాతం నమోదైందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి: కేంద్ర కాఫీ బోర్డులో కాఫీ ఎస్టేట్ సూపర్‌వైజర్, ఎస్టేట్ మేనేజ్‌మెంట్ డిప్లమో కోర్సులకు యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటకలోని చికమంగుళూరు కేంద్ర కాఫీ పరిశోధన సంస్థ సర్టిఫికెట్,డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించిందని తెలిపారు. ఏడాది పాటు కాలపరిమితి గల సర్టిఫికెట్ కోర్సులకు 8 తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. రెండేళ్ల కాలపరిమితి గల డిప్లమో కోర్సులకు ఇంటర్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల వారు ప్రవేశ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు కేంద్ర కాఫీ బోర్డు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. స్థానికంగా ఉన్న కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయాల్లో వివరాలు తెలుసుకోవచ్చునని ఎస్ఎల్‌వో సూచించారు.

విమానయానం...
ప్రగతి విహారం



IIలో

ఆహార కల్తీ నివారణకు తనిఖీలు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కరుణ ఆదేశం



సూచనలిస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కరుణ

రంపచోడవరం: ఏజెన్సీలోని ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కరుణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఫుడ్ అండ్ సేఫ్టీ కంట్రోల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. కిరాణా దుకాణాలతోపాటు రిసార్ట్స్, హోటళ్లలో తాగునీటి శాంపిళ్లు, వంటనూనెలను తనిఖీ చేయాలని సూచించారు. ఫుడ్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఫుడ్ శాంపిళ్ల సేకరణ వివరాలను ఆమె తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గణపతి, ఫుడ్ సేఫ్టీ అధికారులు బి. వేణుగోపాల్, నంద, గ్రేస్, అమ్మశ్రీ, పూర్ణచంద్రరావు,సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టిన వెలుగు యానిమేటర్లు

వెలుగు యానిమేటర్ల డిమాండ్

రంపచోడవరం: వెలుగు యానిమేటర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ముందు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి అరగాటి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలుసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా, ఆందోళనలు చేపట్టినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన కోరారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతతోపాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నరసింహ, బసీరా, సత్యవతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు రూరల్ (అరకు రూరల్): ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీసు, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సూచనలు చేశారు. మద్య సేవించి వాహనాలు నడిపినా, వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించినా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేస్తే రూ.500 జరిమానా విధించాలని సూచించారు. వ్యాపారులు రోడ్లపై సామగ్రి పెట్టడానికి వీలు లేదన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధించాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్రను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ అభిషేక్ గౌడ, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి లీలాప్రసాద్, సీఐ దీనబంధు, ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

పాడేరు రూరల్: కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో భాగంగా శుక్రవారం పాడేరు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షుడు నడిగట్ల ప్రకాశరావు, అసోషియేట్ అధ్యక్షుడు సింహాద్రి, కార్యవర్గ సభ్యులతో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చి పలు సమస్యలను తెలియజేశారు.

అనంతరం వారు మాట్లాడుతు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా గ్రామ సచివాలయం ఏఎన్ఎం గ్రేడ్-3లను పీహెచ్‌సీ పరిధిలోనే పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేటట్టు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు అవసరమైన ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. దీనిపై సానుకులంగా స్పందించిన కలెక్టర్ వీటిపై పరిశీంచి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్టు వారు తెలిపారు.

విమానయానం... ప్రగతి విహారం



● విశాఖ నుంచి ప్రతి నెలా పెరుగుతున్న సర్వీసులు
● రోజుకు 9 వేల మంది ప్రయాణికుల రాకపోకలు
● ఈ ఏడాది కొత్తగా 2 అంతర్జాతీయ విమాన సర్వీసులు
● పెరుగుతున్న విదేశీ ప్రయాణికులు

విశాఖ సిటీ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నుంచి విమానాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నుంచి విమానయానానికి ప్రాధాన్యం పెరుగుతోంది. దేశీయంగానే కాకుండా విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా నానాటికి రెట్టింపు అవుతోంది. ఉత్తరాంధ్ర వాసులే కాకుండా ఒడిశా నుంచి ప్రయాణికులు పెద్ద సంఖ్యలో విశాఖ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రతి ఏడాది ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ పోతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎయిర్‌పోర్టులో సౌకర్యాలతో పాటు దేశయ, విదేశీ విమాన సర్వీసులు పెరుగుతుండడంతో గత ఏడాది కాలంలో మరింత అద్భుతమైన అభివృద్ధి, పురోగతి సాధించింది.

ప్రతి రోజు 9 వేల మంది రాకపోకలు

కోవిడ్ కారణంగా తగ్గిన విమాన సర్వీసులు, ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి నమోదవుతోంది. 2023 నవంబర్‌లో 2,06,213 మంది దేశీయ ప్రయాణికులు రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది అదే నెలలో ఆ సంఖ్య 16.62 శాతం వృద్ధితో 2,40,494కు చేరుకుంది. అలాగే దేశీయ విమాన సర్వీసులు 2023 కంటే ఇప్పుడు 17.94 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రయాణికుల సంఖ్య కూడా విస్తృతంగా పెరగడంతో అందుకు తగ్గట్టుగానే విమాన సర్వీసులు పెరిగాయి. ఒకవైపు దేశీయంగానే కాకుండా విదేశీ విమాన సర్వీసులు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం విశాఖ విమానాశ్రయం నుంచి రోజుకు 9 వేల మంది దేశ, విదేశీ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

పెరిగిన విమాన సర్వీసులు

విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు ప్రాధాన్యత పెరుగుతుండడంతో కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. కోవిడ్‌కు ముందు రోజుకు 23 నుంచి 25 సర్వీసులు ఉండగా ప్రస్తుతం 30 నుంచి 35 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో ప్రధానంగా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, కర్నూల్, జైపూర్, పోర్ట్ బ్లెయిర్‌లకు ఇండిగో, ఎయిర్ ఇండియా సర్వీసులు ఉన్నాయి. అలాగే విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుండడంతో ఇండియా వన్ ఎయిర్, స్కూట్, థాయ్ ఎయిర్ ఏషియా, ఎయిర్ ఏషియా బెర్హాద్ ఎయిర్‌లైన్స్ సింగపూర్, బ్యాంక్, కౌలాలంపూర్‌లకు సర్వీసులు నడుపుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ వరకు విశాఖ నుంచి విజయవాడకు ఒక విమానం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య మూడుకు చేరుకుంది. అలాగే ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి విశాఖకు విమానాన్ని ప్రారంభించేందుకు ఇండియా వన్ ఎయిర్ సిద్ధంగా ఉంది. ఇందుకు ఒడిశా ప్రభుత్వం కూడా ఆమోదించింది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఇలా అన్ని సర్వీసుల ఆక్యుపెన్సీ కూడా 80 నుంచి 95 శాతం నమోదవుతుండడం విశేషం.

సంవత్సరం	దేశీయ ప్రయాణికులు	ఇంటర్నేషనల్ ప్రయాణికులు	మొత్తం ప్రయాణికులు
2018-19	27,03,261	1,50,370	28,53,631
2019-20	25,47,992	1,43,580	26,91,572
2020-21	11,06,451	8,192	11,14,634
2021-22	16,28,317	2981	16,31,298
2022-23	24,35,618	65,171	25,00,789
2023-24	27,22,722	66,192	27,88,914
2024-25 (నవంబర్)	18,22,202	81,760	19,03,962

ఎయిర్‌పోర్టులో సౌకర్యాలపై దృష్టి

విమాన ప్రయాణికులు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా డిజీ యాత్ర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 10 అదనపు చెక్-ఇన్ కౌంటర్లతో పాటు ఇన్-లైన్ హోల్డ్ బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్ (ఐఎల్‌హెచ్‌బీఎస్)ను జోడించారు. దీంతో ఎలాంటి ముందస్తు భద్రతా స్కానింగ్ లేకుండా చెక్-ఇన్ కౌంటర్లలో లగేజీని డిపాజిట్ చేయడానికి, వేగవంతమైన చెక్-ఇన్ ప్రక్రియకు దోహదపడుతుంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆమోదం పొందిన వెంటనే ఈ ఐఎల్‌హెచ్‌బీఎస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు

ఈ ఏడాది కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు ఏప్రిల్ 26వ తేదీ నుంచి వారానికి 3 విమానాలు నడుస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. విదేశీ విమాన ప్రయాణికులు రికార్డు స్థాయిలో పెరిగారు. 2023 నవంబర్‌లో 5,165 మంది రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది నవంబర్‌లో 83.45 శాతం అధికంగా 9,475 మంది ప్రయాణించారు. అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా గతేడాది 35 ఉండగా తాజాగా 77కు పెరిగి 120 శాతం వృద్ధిని సాధించాయి.

మెరుగైన వైద్య సేవలపై దృష్టి పెట్టండి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కరుణ



ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కరుణ

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యసేవలందించి, ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కరుణ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ కరుణ రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని మారేడుమిల్లి , వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలంతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మారేడుమిల్లి, వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజల సంఖ్య, వైద్యాధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కరుణ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

● రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అన్ని వార్డులను పరిశీలించారు . ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లలకు సంబంధించిన న్యూట్రిషన్ హాబిటేషన్ సెంటర్, చిన్నపిల్లలు సంబంధించిన హెల్త్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, పడకలు, పౌష్టికాహారం సరఫరాపై ఆమె ఆరా తీశారు.స్థానిక ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ కొరత ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అనుసంధానంతో ఏరియా ఆస్పత్రిలో బ్లక్‌బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. నూతన తల్లీ, బిడ్డ ఆస్పత్రి భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఏరియా ఆస్పత్రి వెనుక భాగంలో నిర్మిస్తున్న 30 పడకల భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఈ ఏరియా ఆస్పత్రిలో వివిధ రకాలైన వైద్య సేవలందించే బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వెయిటింగ్ హాల్ అదే విధంగా క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని ఆమె పరిశీలించారు. కమిషనర్ వెంట చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గణపతి, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, ఆర్ఎం వెంకట ఇందిరా, ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్ లక్ష్మి, ఏడీఎంహెచ్ ఓ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

కూనవరం: విజయవాడ, కూనవరం ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, వీ.ఆర్. పురం వరకు పొడిగించాలని విలీన మండలాల ప్రజలు కోరుతున్నారు. గత అక్టోబర్ 28న నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సర్వీసు విజయవాడ, కూనవరం మీదుగా కుంట గ్రామం వరకు ఉండేది. ఇటీవల అర్ధంతరంగా ఈ సర్వీసును నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండలాల ప్రజలకు ఈ సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. విజయవాడలో రాత్రి 10.15 గంటలకు బయలుదేరి భద్రాచలం తెల్లవారుజామున 4.00 గంటలకు చేరుకుంటుంది. ఆ సమయంలో భద్రాచలం నుంచి కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండల ప్రజలకు ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. రాత్రి వేళల్లో వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి భద్రాచలం చేరుకున్న ప్రయాణికులకు ఉదయం 4.00 గంటల ఈ సర్వీసు ఎంతో వెసులుబాటుగా ఉండేది. భద్రాచలం బస్టాండ్‌లో వైటింగ్ సమస్య తీరిందని ప్రయాణికులు ఆనందపడేవారు. అయితే మూడు రోజుల క్రితం నుంచి ఈ సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. వాస్తవానికి కూనవరం నుంచి కుంట గ్రామానికి వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండరు. విజయవాడ, కూనవరం సర్వీసును వి.ఆర్.పురం మండలం రేఖపల్లి వరకు పొడింగించినట్లు అయితే సర్వీసుతో ఎక్కువ ప్రయాణికులు ఉంటారని పలువురు చెబుతున్నారు. ఈ మేరకు ఆర్టీసీ డీటీఓ, విజయవాడ డీఎంలు పరిశీలించి విజయవాడ, కూనవరం , వి.ఆర్.పురం సర్వీసు ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై విజయవాడ డీఎంను వివరణ కోరగా ఆ సర్వీసు విజయవాడ-కుంట సర్వీసు అని కొద్ది రోజులు వయా కూనవరం నుంచి కుంట గ్రామానికి నడిపామన్నారు. టార్గెట్ రావడం లేదని కూనవరం నిలిపివేశామన్నారు.

డీటీవో కృష్ణకు వినతిపత్రం ఇస్తే విజయవాడటు కూనవరం వయా రేఖపల్లి రూట్ బస్సు సర్వీసుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ ఆదాపై అవగాహన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

రంపచోడవరం: విద్యుత్ పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమానినిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఈఈ టి.గాబ్రియేల్ మాట్లాడుతూ విద్యుత్ ఆదాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అవసరమైనపుడు మాత్రమే ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు వంటి వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ కె.వి.వి.నాగ సంతోషి, విద్యుత్ శాఖ ఏఈలు ఎం.దొరబాబు, షాలేము, పాఠశాల సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

తెగిపడిన యువకుడి కాలు

ఎటపాక: మండలంలోని రాయనపేట వద్ద జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకుడి కాలు తెగి రహదారిపై పడిన ఘటన భయాందోళనకు గురిచేసింది. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లికి చెందిన కెల్లా సాయిఈశ్వర్ భద్రాచలం పట్టణంలోని శ్రీనివాస నర్సింగ్ హోంలో లాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఏడుగురాళ్లపల్లి బయలుదేరాడు. ఈక్రమంలో ఎటపాక మండల పరిధిలోని రాయనపేట వద్ద చింతూరు నుంచి భద్రాచలం వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు బైక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో సాయి ఈశ్వర్ ఎడమ కాలు తెగి రహదారిపై పడగా తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): విజయవాడ-కాజీపేట సెక్షన్ పరిధిలో ఆధునిక పనుల నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కింది రైళ్లు ఆయా తేదీల్లో వయా గుంటూరు-పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

●ఈనెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు సీఎస్‌టీ ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు షాలిమర్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్-షాలిమర్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 1, 8వ తేదీల్లో షాలిమర్-సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7న సికింద్రాబాద్-షాలిమర్ (12774) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 8, 9వ తేదీల్లో విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

సిరులతల్లి.. కరుణించమ్మా..

● కనకమహాలక్ష్మి ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమ పూజలు
● మార్మోగిన అమ్మవారి నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

యలమంచిలి రూరల్: కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక లక్ష కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభించిన పూజల్లో సుమారు 1000 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. కలశం, అమ్మవారి ఫొటో, గాజులు, జాకెట్లుతో మహిళలంతా భక్తిశ్రద్ధలతో పూజా క్రతువు పూర్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వర కుమారశర్మ భక్తులతో పూజలు చేయించారు. పూజాదికాల తర్వాత పూర్ణాహుతిలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. పూజల్లో పాల్గొన్న భక్తులకు స్థానిక కిరాణా వ్యాపారి సమయమంతుల బుచ్చియ్య జాకెట్లు, పసుపు, కుంకుమ సమకూర్చారు. పూజల అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఉదయం వేకువ జామున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి, తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. శుక్రవారం ఉద్యయం వర్షం కురిసినప్పటికీ పూజకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక షామియానాలు, బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, పిల్లా రాము, కొఠారు సూర్యప్రకాష్, తాటిపాకల మాణిక్యాలరావు, తాటిపాకల చిన్ని, చాగంటి శివ మణికంఠ, తుంపాల దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కోత తీవ్రం

రెండు చోట్ల కూలిన పార్క్ గోడలు



నోవాటెల్ హోటల్ ఎదురుగా కూలిన గోడ



కోతకు గురైన ప్రాంతం పరిశీలిస్తున్న కమిషనర్



బోయివీధి సమీపంలో రోడ్డు కింద కోతకు గురైన ప్రాంతం



కోస్టల్ బ్యాటరీ సమీపంలో కూలిన పార్క్ గోడ

ఏయూక్యాంపస్/భీమునిపట్నం/ఆరిలోవ: సముద్ర తీరంలో కోత తీవ్రమవుతోంది. గడిచిన నెల రోజులుగా వైఎంసీఏ ఎదురుగా తీరం కోతకు గురవుతుండగా.. తాజాగా ఆర్.కె బీచ్ నుంచి కోస్టల్ బ్యాటరీ దిశగా కొనసాగుతోంది. అల్పపీడన ప్రభావంతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలకు తీరం కోతకు గురవుతోంది. శుక్రవారం నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న చిన్నారుల పార్క్ వెనుక భాగంలో, కోస్టల్ బ్యాటరీకి వెళ్లే మార్గంలో ఉన్న మరో పార్క్‌లో వెనుక భాగంలో గోడలు కూలిపోయాయి. పార్క్‌లోని కొన్ని ఆట వస్తువులు కిందకు జారిపోయాయి. సమాచారం అందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నోవాటెల్ ఎదురుగా చిన్నారుల పార్క్ ప్రాంతాన్ని సందర్శించారు. త్వరితగతిన రక్షణ చర్యలు చేపట్టాలని, సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నందున ప్రజలు బీచ్‌లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడును ఆదేశించారు. అలాగే వైఎస్సార్ సీ వ్యూ(సీతకొండ) పాయింట్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు ప్రాంతాల్లో శుక్రవారం సముద్రం కొన్ని మీటర్ల ముందుకొచ్చింది. తెన్నేటి పార్కు దిగువున తీరంలో నిలిచిపోయిన ఎంవీ మా షిప్ దాటి నీరు ముందుకు చేరింది.

భీమిలి తీరంలోనూ...

భీమునిపట్నం నోవాటెల్ రిసార్ట్ ఎదురుగా తీరం గతంలోనే చాలా వరకు కోతకు గురైంది. ఇప్పుడు అలల తాకిడికి మరింత కోతకు గురై రోడ్డు వరకు వచ్చేసింది. అలాగే బోయివీధి దగ్గరలో రోడ్డు కింద గట్టు భారీగా కోతకు గురైంది. గతంలో ఈ ప్రాంతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇలానే కొనసాగితే ఎత్తులో ఉన్న రోడ్డు కూలిపోయే ప్రమాదం ఉంది. సమాచారం అందుకున్న అధికారులు కోతకు గురైన ప్రాంతంలో బండరాళ్లు వేయించారు.